కథ

# ప్రేమపాశం

-పి.విజయగౌరి

**ట్రేంగ్ ... ట్రింగ్ ... ట్రింగ్ ... ట్రింగ్**

**బెడ్‌పక్క ఫోన్ నిర్విరామంగా మ్రోగుతోంది. కళ్ళు తుడుచుకుంటూ రిసీవర్ విసురుగా చేతిలోకి తీసుకుంది మోహన... విసుగ్గా ....**

''హలో!'' అంది.

''హెలో! ప్రసాదరావు గారు మీ ఫాదరేనా?!'' - అవతల్నించి ఖంగారుగా అడిగిందో గొంతు.

''అవును!'' నిర్లిప్తంగా అంది మోహన.

''మేడమ్! మీ ఫాదర్‌కి యాక్సిడెంట్ అయ్యింది. కండీషన్ చాలా సీరియస్‌గా వుంది. మీరు వెంటనే బైల్దేరి రండి ...'' అంటూ ఖంగారుగా హాస్పిటల్ పేరు, వివరాలు చెప్పి ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

చిగురుటాకులా వణికిపోయింది మోహన. ఒక్క ఉదుటున లేచి డ్రెస్ చేసుకుని, బైటికి వచ్చి 'అపోలో' అని చెప్పి ఆటో ఎక్కి కూర్చుంది. మరుక్షణమే గతం తాలూకు జ్ఞాపకాలామెని ఆర్తిగా చుట్టుముట్టాయి.

''నాకు మమ్మీ, డాడీ - మమ్మీ, డాడీకి నేను ...''

చిన్నప్పటి నుంచి మోహన చుట్టూ అల్లుకున్న ప్రపంచం ఇదే. వారి చిన్ని ప్రపంచంలో మరెవరికీ చోటిచ్చే వారు కాదు. ''మన ప్రసాద్ హెన్‌పెక్‌డ్ కాదు, డాటర్ పెక్‌డ్ కూడా ...'' అంటూ చుట్టుపక్కల వాళ్ళు వేసే జోక్స్‌ని నవ్వుతూ కొట్టి పారేసేవాడు ప్రసాదరావు. అప్పుడప్పుడూ కొందరు కొలీగ్స్ - ''ఒరే ప్రసాద్! నువ్వూ, సంధ్య మీ ప్రేమతో మోహనకి మరో ప్రపంచం తెలీకుండా పెంచుతున్నారు. దానివల్ల, పాపకి మీ పట్ల ఓవర్ పొసెసివ్‌నెస్ పెరిగే ప్రమాదముంది జాగ్రత్త'' అని హెచ్చరించే వారు. అయినా పట్టించుకునే వాడు కాదు ప్రసాదరావు.

వాళ్ళ చిన్ని ప్రపంచాన్ని రెగ్యులర్‌గా విజిట్ చేసే అతిథి - తండ్రి క్లాస్‌మేట్, కొలీగ్ అయిన సిద్ధార్థ ఒక్కడే. అయితే తల్లి ఎప్పుడూ ఒక అందమైన అమ్మాయి ఫోటోని చూపించి కరుణ ఆంటి అంటుండేది మోహనతో. చిన్నప్పటి నించీ తల్లి అప్పుడప్పుడూ కరుణ గురించి చెప్పిన విశేషాలతో - కరుణంటే తెలీని ఇష్టాన్ని, కుతూహలాన్ని పెంచుకుంది మోహన. ఆమె ఎనిమిదో తరగతిలో వుండగా హఠాత్తుగా గుండెపోటుతో చనిపోయింది సంధ్య. అప్పుడే ... మొదటిసారిగా కరుణని చూసింది మోహన. తల్లిపోయిన షాక్‌తో పిచ్చిదానిలా అయిపోయిన మోహనకి మామూలు మనిషిని చేయటానికి ఎన్నో పాట్లుపడ్డారు ప్రసాద్, సిద్ధార్థ, కరుణ. అప్పటి నించీ మోహనకి తనే తల్లీ, తండ్రీ అయ్యాడు ప్రసాదరావు: అలా నాలుగేళ్ళు గడిచిపోయాయి.

మోహన డిగ్రీ మొదటి సంవత్సరంలో వుండగా ...

ఒక రోజు క్లాసెస్ కాన్సిల్ కావటంతో త్వరగా ఇంటికి వచ్చేసింది మోహన. ఇంట్లో అడుగు పెట్టిన ఆమెకి హాల్లో ... సోఫాలో ... తండ్రి భుజంపై తలవాల్చి మాట్లాడుతున్న కరుణ కనిపించింది. ఒక్కసారిగా చుట్టూ వున్న ప్రపంచం గిర్రున తిరిగినట్లైంది మోహనకి.

ఆమె ఇంకా ఆ షాక్‌లో వుండగానే ...

''మోహీ! నేను, కరుణ ఆంటి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. నేనే ఈ విషయం నీతో చెప్దామనుకుంటున్నా ...''

తండ్రి మాటలు పూర్తి కాకుండానే గిరుక్కున వెనుతిరిగి తన రూమ్‌లోకి వెళ్ళి తలుపు బిగించుకుంది మోహన.

''ఛీ .. ఛీ ... కరుణాంటీ ఎంత నీచమైన వ్యక్తి.'' తల్లి ఆమె గురించి ఎంత ప్రేమగా చెప్పేదో గుర్తొచ్చి ఆవేశంతో మోహన గుండెలు మండిపోసాగాయి.

మళ్ళీ కరుణ వెళ్ళిపోయిందని తండ్రి చెప్పాకే మోహనగది తలుపులు తెరుచుకున్నాయి. ఆ తరువాత తండ్రి ఎప్పుడూ ప్రస్తావన లేకపోయినా, మోహనతో ఎంత ప్రేమగా వుండాలని ప్రయత్నించినా - తండ్రితో ముభావంగానే వుండేది మోహన. తనకీ ... తండ్రికీ మధ్య ఎన్నటికీ తొలగించలేని ఓ అడ్డుగోడ ఏర్పడినట్టుగా ఫీలయ్యేదామె. అప్పటి వరకూ ప్రేమ తప్ప మరో భావన తెలీని మోహికి మనసులో తండ్రంటే ఓ విధమైన ద్వేషం ఏర్పడసాగింది. ఇందాకటి ఫోన్‌తో మళ్ళీ ... గుండె పొరల్లో తండ్రంటే దాగున్న ప్రేమ, మమకారం, ఒక్కసారిగా పెల్లుబికాయి ఆమెలో.

క్రీచ్ ... ఆటో ఆగడంతో ఆలోచనలకి కూడా బ్రేక్ పడింది.

ఆటో దిగి పరుగు, పరుగున వెళ్ళి రూమ్ నెం. 7 ముందు నిలిచింది మోహన. వణుకుతున్న వేళ్ళని అదుపులోకి తెచ్చుకుంటూ తలుపు తోయబోయింది.

లోపలినించి చిరపరిచితమైన ఆడగొంతు ...

మెల్లగా తలుపుతోసి లోపలికి తొంగి చూసిన మోహనకి, తండ్రి పక్కనే కూర్చుని వున్న కరుణ కన్పించింది. అంతే ... గిరుక్కున వెనుతిరిగిందామె.

చకచకా మెట్లు దిగుతున్న మోహనకి ఎదురు పడ్డాడు సిద్ధార్థ.

''ఏమ్మా? డేడీని చూశావా?!'' ప్రశ్నించాడు.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది మోహన.



(గ్రాఫిక్స్: భాస్కర్)

''ఏం?!''

''చూడాలనే వెళ్ళాను. కానీ... కానీ ఆ బ్లడీ బిచ్ -'' ఆవేశం, దుఃఖం తన్నుకు రాగా మాటరాక తడబడింది మోహన.

''ఇందులో ఆవేశపడాల్సింది ఏముంది మోహనా? నీ తండ్రికి యాక్సిడెంట్ అయితే నీ కంటే ఎక్కువ తల్లడిల్లిపోయే వ్యక్తి మీ అమ్మే కదా?!!'' - తాపీగా ఆమెనే గమనిస్తూ ప్రశ్నించాడు సిద్దార్ధ.

''అంకుల్!'' దెబ్బతిన్న లేడిపిల్లలా అరిచింది మోహన.

''మీరు కూడా వాళ్ళ రిలేషన్‌ని సమర్ధిస్తున్నారా?!'' అంటూ ఒక్కసారిగా మెట్లపై కూలబడి వెక్కి వెక్కి ఏడ్వసాగింది మోహన.

ఆమెని అనునయిస్తూ సిద్దార్థ - 'మోహీ! కంట్రోల్ యువర్ సెల్ఫ్! నే చెప్పేది జాగ్రత్తగా విను. అమ్మ నిజం, నాన్న నీడ అంటారు అందరూ. కానీ ... కానీ ... నీ విషయంలో మీ అమ్మే నీడమ్మా!!

''అంకుల్! ఏంటి మీరనేది?'' అయోమయంగా చూస్తూ అడిగింది మోహన.

''అర్థం కాలేదామ్మా!! నేను, ప్రసాద్, కరుణ, మీ అమ్మ క్లాస్ మేట్స్. అనాథైన కరుణని మీ అమ్మ ఎంతో ప్రేమగా సొంత చెల్లెల్లా చూసుకునేది. మీ అమ్మ మనసు తెలీని కరుణ ప్రసాద్ ప్రేమనిఅంగీకరించింది. పెళ్ళి జరగబోతోందన్న ధీమాతో తొందరపడింది. కరుణకి నెల తప్పిందని తెలిసినప్పుడు సంతోషంలో తేలిపోయారు కరుణ - ప్రసాద్. అదే సమయంలో మీ అమ్మ ప్రసాద్‌ని కోరుకుంటోందని తెలిసింది కరుణకు. మీ అమ్మ కళ్ళలో ఆనందం తప్ప ఆవేదన చూడలేని కరుణ వెంటనే ప్రసాద్‌ని కలిసింది. తమ విషయం ఎప్పటికీ మీ అమ్మకి తెలీకూడదని, ఒక వేళ తెలిస్తే తను బిడ్డతో సహా ప్రాణాలు తీసుకుంటానని బెదిరించి ప్రసాద్‌తో మీ



అమ్మ పెళ్ళి జరిపించింది. మీ అమ్మ ఎంత తిట్టినా, అసహ్యించుకున్నా - తన కడుపులో బిడ్డకి తండ్రి ఎవరో ఆమెకి తెలీనివ్వలేదు కరుణ.''

''అంకుల్! ఇదంతా ... ఇదంతా ... నిజమా'' - నమ్మలేనట్లు అడిగింది మోహన.

''ఔనమ్మా! అయితే ఈ కథ ఇంతటితో ఆగిపోతే ఈ రోజు నువ్వూ, నేను ఇలా మాట్లాడుకునే వాళ్ళం కాదేమో. కరుణకి ఎనిమిదో నెల జరుగుతుండగా ఒక రోజు మీ అమ్మ స్టెప్స్ మీంచి జారిపడిపోయింది. అప్పుడు జరిగిన టెస్ట్స్‌లో మీ అమ్మ ఎప్పటికీ తల్లి కాలేదని తెలిసింది. తరువాత కథ మీ అమ్మ మాటల్లోనే చదువమ్మా!'' - అంటూ ఓ డైరీ మోహన చేతిలో పెట్టి ప్రసాద్ రూమ్‌వైపు వెళ్ళిపోయాడు సిద్ధార్థ.

అన్యమనస్కంగా డైరీ పేజీలు తిప్పుతున్న మోహన చూపు ఠక్కున ఓ చోట ఆగిపోయింది. చదివిన అక్షరాలే మళ్ళీ చదువుతూ మనసులో ఇంకించుకోడానికి ప్రయత్నించసాగింది.

**జూలై 7**: ఈ రోజు నేననుభవించిన నరకం మాటల్లో చెప్పలేను. నేనెప్పటికీ తల్లిని కాలేనన్న ఊహే నన్ను నిలువునా దహించివేస్తోంది. నేను తల్లిని కాలేనని తెలిసినా ప్రసాద్ నన్ను ప్రేమగా అక్కున చేర్చుకున్నాడు. కానీ ఈ ప్రపంచం ... నా చుట్టూ వుండే వాళ్ళ జాలి చూపులు, ఈటెల్లాంటి మాటలూ నేనెలా తట్టుకోవాలి. వీల్లేదు. ప్రపంచానికి ఈ నిజం తెలీడానికి వీల్లేదు. అనుకోకుండా నా మనసులో ఓ ఆలోచన. అంతవరకూ కరుణతో ముభావంగా వుంటున్న నేను, ఈ రోజు మనసు విప్పి మాట్లాడాను. పిచ్చిపిల్ల. ఎంతో సంబరపడిపోయింది. మెల్లగా నా మనసులో మాట బైటపెట్టాను.

''కరుణా! నువ్వీ బిడ్డకి జన్మనివ్వగలవే కానీ, సంఘంలో గుర్తింపు నియ్యలేవు. అదే నా బిడ్డగా పెరిగితే సమాజంలో ఓ హోదా వుంటుంది. ముఖ్యంగా చెప్పుకోవడానికి ఓ తండ్రి వుంటాడు'' - అన్నాను. దాని కళ్ళలో ఒక్క క్షణం దెబ్బతిన్న భావన. కళ్ళార్పి గట్టిగా నవ్వేసింది. ''నీ ఇష్టం అక్కా'' అంది.

''నీ ఇష్టమంటే కాదు. బైట ప్రపంచానికి నువ్వు అమ్మవన్న విషయమే తెలీకూడదు. అంటే ... నా జీవితంలోకి నువ్వెప్పుడూ అడుగు పెట్టకూడదు'' - అన్నాను నా మాటలు తనకి సరిగా అర్థం కాలేదేమోనని.

''నా బ్రతుక్కి అర్థమే నువ్వు సంతోషంగా వుండటం. అలాంటప్పుడు మళ్ళీ నీక్కనిపించి నిన్ను బాధపెడతానని ఎలా అనుకున్నావక్కా'' నాకేసే సూటిగా చూస్తూ అంది కరుణ.

**సెప్టెంబర్ 5**: మోహన పుట్టింది. పొత్తిళ్ళలో పువ్వులా వున్న పాపాయిని చూడగానే నా హృదయంలో మాతృత్వం పొంగులెత్తింది. పాపని పూర్తిగా గుండెలకి హత్తుకున్నాను. కరుణవైపోసారి చూసి గదిలోంచి బైటికి నడిచాను. అదే ఆఖరిసారి - నేను కరుణని చూడటం!!!...

చదువుతున్న మోహన కళ్ళు కన్నీళ్ళతో పుట్టిళ్ళయ్యాయి. 'అమ్మా' ... 'అమ్మా' ... అంటూ మనసు ఆర్తిగా పిలుస్తోంది. ఎదురుగా గోడపై వున్న 'యశోద మాయమై సంకెళ్ళు పడ్డ చేతులతో ఆర్తిగా చిన్ని కృష్ణుణ్ణి గుండెలకి హత్తుకుంటున్న దేవకి కనిపిస్తోంది. కృష్ణుడే ఆరోప్రాణిగా బ్రతికిన యశోదదీ ... అమ్మ ప్రేమే!

తను కన్న కన్నయ్యకోసం మౌనంగా తపించిపోయిన దేవకిదీ అమ్మ ప్రేమే!!

అయితే - యశోదమ్మ ప్రేమతత్వం తులసికోటపై వెలుగులు చిందించే ప్రమిదలా పవిత్రమైనదైతే ... దేవకి ప్రేమతత్వం తపించి 'పోయే' వారి దాహం తీర్చే తులసి తీర్థంలా మోక్షప్రాయమైనది. కరుణ నిండిన కళ్ళు లాలనగా చూస్తున్న అనుభూతి. మనసులోని భారమంతా కన్నీటి రూపంలో కరిగిపోతుంటే ... అమ్మ నిండిన గుండెతో అడుగు ముందుకు వేసింది మోహన.